నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
3 | నిజామాబాద్ బుధవారం 8 మే 2024 | ADILABAD NIRMAL

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

విద్యార్థులతో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 7 : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక డైట్ కళాశాలలో నిర్వహించిన సైన్స్ సమ్మర్ క్యాంప్‌లో ముఖ్యఅతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మూఢనమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలని, శాస్త్రీయ దృక్పథం, ప్రతి అంశంపై ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అంతకుముందు సైన్స్ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థుల ప్రదర్శనను తిలకించారు. మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేస్తున్న జనవిజ్ఞాన వేదికను అభినందించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందించారు. డీఈవో ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్ కుమార్, బేదొడకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

5 కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ అర్బన్, మే 7 : ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని ఓటర్లకు నిర్మల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు ఓటర్లకు అవగాహన కల్పించేందుకు స్వీ ప్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాలయం నుంచి 5కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఓటు హక్కు అనేది రాజ్యాంగం మనకు కల్పించిన గొప్పవరమని తెలిపారు. గత ఎన్నికల్లో పట్టణ ప్రాంతంలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైందని తెలిపారు. ఈ సారి వందశాతం పోలింగ్ కోసం కృషి చేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, భుజంగ్‌రావు, విజయలక్ష్మి, విష్ణువర్ధన్, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

కేసీఆర్ గర్జన వల్లే.. రైతుబంధు పడింది..

మాజీ మంత్రి జోగు రామన్న

తానూర్, మే 7 : కేసీఆర్ గర్జన వల్లే రైతుబంధు డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమ అయ్యాయని, కార్యకర్తలు పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి అత్రం సక్కు గెలుపు కోసం కృషి చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రజా సంక్షేమానికి చేసిందేమీ లేదని, బీఆర్ఎస్‌కే ప్రజాదరణ ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న తెలంగాణ.. నేడు కరువు కాటకాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు దేవుళ్ల పేరిట రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. ఆ పార్టీలో సభ్యత్వం లేని నేతలకు ఎంపీ టికెట్ ఇవ్వడం వారి దురావస్థకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు పడకంటి రమాదేవి, నాయకులు లోలం శ్యాం సుందర్, విలాస్ గాదేవార్, కిరణ్ కుమ్రేవార్, నసీర్ బేగ్, విష్ణువర్ధన్ రెడ్డి, గోపాల్ స్వామి, గజానంద్ పటేల్, శివదాస్ పటేల్, మొగిలి, ఎంపీటీసీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లాలోని నూతన కలెక్టరేట్ కార్యాలయం

కొత్త జిల్లాలు రద్దు చేస్తే.. పాత కష్టాలే..

నూతన జిల్లాల ఏర్పాటుతో చేరువైన పాలన

- దశాబ్దాల కలను సాకారం చేసిన కేసీఆర్ సర్కారు
- జిల్లాలను రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- మండిపడుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజానీకం

మంచిర్యాల, మే 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కొత్త జిల్లాలను రద్దు చేస్తామంటూ వస్తున్న ప్రకటనలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులు వ్యతిరేకిస్తున్నారు. ఉన్న జిల్లాలను రద్దు చేసి.. మళ్లీ పాత కష్టాలు తెస్తారా? అంటూ మండిపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేయాలనేది దశాబ్దాల కల. పాత జిల్లా ఉన్నప్పుడు మంచిర్యాల, ఆసిఫాబాద్‌లను తూర్పు జిల్లా అని పిలుచుకునే వారు. ఆదిలాబాద్– నిర్మల్‌లను పశ్చిమ జిల్లాగా చెప్పేవారు. అప్పుడెప్పుడో ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మంచిర్యాలను ప్రత్యేక జిల్లా చేస్తామంటూ ప్రకటించారు. కానీ.. దశాబ్దాలపాటు అది కేవలం నినాదంగానే మిగిలింది. ప్రభుత్వాలు మారినా జిల్లాల పునర్విభజన జరగలేదు. ఉద్యమ సమయంలో ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తామంటూ ప్రకటించిన కేసీఆర్.. స్వరాష్ట్రం సాధించుకున్నాక జిల్లాల పునర్విభజనపై అద్భుతమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. మందుచూపుతో మంచిర్యాలతోపాటు ఆసిఫాబాద్, నిర్మల్‌లను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేసి.. జిల్లా వాసుల దశాబ్దాల కలను సాకారం చేశారు.

ఎన్నో సంస్కరణలకు బీజం

తెలంగాణలో 2016లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం ద్వారా పరిపాలన చేరువైంది. జిల్లాలతోపాటు కొత్త మండలాలు, కొత్త మున్సిపాలిటీలు వచ్చాయి. అన్నింటికంటే మించి మారుమూల గోండు గూడేలు, తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయి. రూ.55 కోట్ల నుంచి రూ.60 కోట్లతో కొత్త కలెక్టరేట్ కార్యాలయాలు నిర్మితమయ్యాయి. ఎస్పీ కార్యాలయాలు, కమిషనరేట్లు, మెడికల్, నర్సింగ్ కాలేజీలు, రెవెన్యూ డివిజన్‌లు ఇలా ఎన్నో ఎనిమిదేళ్లలో జరిగాయి. కొత్త జిల్లాలు అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచాయి. అన్నింటికీ మించి ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి. ప్రైవేటు పరిశ్రమలు, కంపెనీలు, బ్యాంకులు, రోడ్లు, రైలు మార్గాలు ఇలా అనేక హంగులు కొత్త జిల్లాలకు సమకూరాయి. జిల్లా కార్యాలయాలు అత్యంత సమీపంలోకి వచ్చాయి. పరిధి చిన్నగా ఉండడంతో పాలనపై కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణ పెరిగింది. ప్రజాసమస్యల పరిష్కారంలో వేగం పెరిగింది. ఎస్పీ కార్యాలయాలు, కమిషనరేట్లు రావడంతో శాంతి భద్రతలు పెరిగాయి. నేరాలు నియంత్రణలోకి వచ్చాయి. జిల్లాలకు ప్రైవేటు పెట్టుబడిదారులు రావడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. చిన్న జిల్లాలు రాష్ట్రానికి ఆర్థిక వనరులుగా మారాయి.

ఇప్పుడు కుదిస్తే కష్టాలే..

కొత్త జిల్లాలను రద్దు చేసి పాత జిల్లాలను కొనసాగించినా.. పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా జిల్లాలను ఏర్పాటు చేసినా ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉన్న ఫలంగా జిల్లాలను కుదిస్తే వచ్చే లాభాల కంటే, నష్టాలే ఎక్కువని చెప్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులకు ఇబ్బందులు వస్తాయి. కొత్త జిల్లాలతో చాలా మందికి ప్రమోషన్లు వేగంగా వచ్చాయి. ఇప్పుడు రద్దు చేస్తే వారి పరిస్థితి ఎలా ఉంటుందనేది చెప్పలేం. ఇక నిరుద్యోగులు ఉద్యోగాల కోసం మరో రెండు, మూడేళ్లు ఎదురుచూడాల్సి వస్తది. జిల్లాలను మారిస్తే జోన్ల విభజన కచ్చితంగా చేయాలి. నూతన జోనల్ వ్యవస్థను రూపొందించాలి. దానికి అసెంబ్లీ ఆమోదం తీసుకుని, రాష్ట్రపతి ఉత్తర్వుల కోసం పంపాలి. ఈ ప్రక్రియంతా పూర్తయ్యేసరికి యేండ్లు గడిచిపోతాయి. అప్పటి వరకు కొత్త నోటిఫికేషన్లు ఇవ్వడానికి వీలుండదు. ఫలితంగా నిరుద్యోగులు నష్టపోతారు.

పాత రోజులు తప్పవ్..

ఉమ్మడి జిల్లాలో కొత్త జిల్లాలను రద్దు చేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి. మంచిర్యాల, ఆసిఫాబాద్ నుంచి కలెక్టరేట్‌కు పోవాలంటే 100, 150 కిలోమీటర్లు పోవాలి. మారుమూల ప్రాంతాలైన బెజ్జూర్, సిర్పూర్, చింతలమానేపల్లి, కౌటాల, వేమనపల్లి, కోటపల్లి, నెన్నెల నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే ఒక్క రోజు పడుతుంది. ఇంట్లో సద్ది కట్టుకుని ఆదిలాబాద్ పోయేందుకు ఒక రోజు, అక్కడ పని చూసుకునేందుకు ఒక్క రోజు, అది పూర్తయ్యాక తిరిగి రావడానికి మరో రోజు మొత్తం మూడు రోజులు కేటాయించాలి. వ్యయ ప్రయాసలు పెరుగుతాయంటూ పాత రోజులను తలచుకుని జిల్లావాసులు భయపడిపోతున్నారు. కోరి కొరవితో తలగొక్కునట్లు ఏదో మార్పు కోసమని నమ్మి కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇన్ని కష్టాలు పడాల్సి వస్తుందనుకోలేని వాపోతున్నారు. జిల్లాల జోలికొస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఉన్న జిల్లాలను రద్దు చేయాలని ఎవ్వరం కోరుకోవడం లేదని చెప్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ తన ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే కొత్త జిల్లాల రద్దుకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు.

జిల్లాలు రద్దు చేస్తే నష్టాలివే..

- జిల్లా స్థాయి అధికారులు, ఆఫీస్‌లు మళ్లీ ప్రజలకు దూరమవుతాయి. కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు, పోలీస్ కమిషనరేట్లు అలంకారప్రాయంగా మారుతాయి.
- జిల్లా దవాఖానల స్థాయి పడిపోతుంది. నిధులు, సదుపాయాలు తగ్గుతాయి. జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పడిన మెడికల్, నర్సింగ్ కాలేజీలకు ఇబ్బందులు ఎదురవుతాయి. ● జోనల్ వ్యవస్థను మళ్లీ మార్చాల్సి వస్తుంది. ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యమవుతాయి. ● కొత్త జిల్లాలతో ప్రమోషన్లు పొందిన ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతాయి. క్యాడర్ స్ట్రెంత్ తగ్గిపోయి ప్రమోషన్లపై ప్రభావం పడుతుంది.
- కొత్త సంస్థలు, ప్రముఖ కంపెనీలు, పరిశ్రమల ఏర్పాటు తగ్గిపోయి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. ఇప్పటి వరకు వచ్చిన సంస్థలు వెనక్కి పోయే ప్రమాదం ఉంది.
- ఉమ్మడి జిల్లాలో ఇప్పుడున్న నలుగురు కలెక్టర్లు, ఎనిమిది మంది అడిషనల్ కలెక్టర్లు పోయి ఒక కలెక్టర్, ఇద్దరు అడిషనల్ కలెక్టర్లు మాత్రమే ఉంటారు. దీంతో జిల్లా పర్యవేక్షణ కష్టమవుతుంది. సామాన్యుల సమస్యల పరిష్కారానికి అధిక సమయం పడుతుంది.
- జిల్లాలవారీగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, నవోదయ వంటి విద్యా సంస్థలకు నిధులు తగ్గిపోతాయి.

కాంగ్రెస్‌ది మూర్ఖపు ఆలోచన

కొత్త జిల్లాల ఏర్పాటు కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచి మంచిర్యాల ప్రజలు ఎదురు చూశారు. దశాబ్దాల కలను కేసీఆర్ సీఎం అయ్యాక నెరవేర్చారు. ఏర్పడిన జిల్లా ఇప్పుడు దశాబ్దకాలం కూడా ఉండేలా లేదు. రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ చిన్న జిల్లాలు ప్రగతికి సోపానాలు అని చెప్పారు. అలాంటి రేవంత్‌రెడ్డి జిల్లాలు ఎందుకు రద్దు చేస్తున్నారో ఆయనకే స్పష్టత లేదు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన రోజు కచ్చితంగా ఒకటి వస్తది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉన్నప్పుడు కలెక్టరేట్‌కు పోయి కష్టాలు చెప్పుకోవడం కంటే నష్టపోవడమే మేలు అనుకునేవాళ్లు చాలా మంది. జిల్లా కేంద్రానికి వెళ్లి రావాలంటే మూడు, నాలుగు రోజుల సమయం పట్టేడి. అలాంటి పరిస్థితి నుంచి గంటలో కలెక్టర్‌ను కలుసుకునే రోజులు వచ్చాయి. కేసీఆర్ సర్కార్ చేసిన పనుల ఆనవాళ్లు లేకుండా చేయాలనేది కాంగ్రెస్ మూర్ఖపు ఆలోచన. దీంతో పట్టణాలు, నగరాలు మళ్లీ వెనకబడి పోతాయి. జిల్లాల రద్దు ఆలోచనను వెనక్కి తీసుకోవాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. ప్రజలకు నష్టం చేసే ఏ పనినైనా నిలదీస్తాం. మా అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు జిల్లాల రద్దుకు వ్యతిరేకంగా యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

- గోగుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి

మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్

రేపు భైంసాకు కేటీఆర్ రాక

భైంసా, మే 7 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల 9న గురువారం భైంసాకు రానున్నారని ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ తెలిపారు. మంగళవారం భైంసాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న మున్సిపల్ కార్యాలయం వద్ద చౌరస్తాలో కేటీఆర్ రోడ్ షో ఉంటుందని తెలిపారు. ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ముథోల్ నియోజకవర్గ పార్లమెంట్ సమన్వయ కమిటీ సభ్యులు డా. పీ. రమాదేవి, లోలం శ్యాంసుందర్, విలాస్ గాదేవార్, డా. కిరణ్ కొమ్రేవార్ తదితరులున్నారు.

దస్తురాబాద్ : రేవోజిపేటలో ధాన్యం కుప్పలపై కవర్లను కప్పిన రైతులు

రైతన్న ఆగమాగం

- ఈదురుగాలులు, వడగండ్ల వానతో భారీ నష్టం
- తడిసిన ధాన్యం.. విరిగిన చెట్ల కొమ్మలు..
- నేలకొరిగిన జొన్న, కూరగాయల పంటలు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం..

ఇంద్రవెల్లి/ఉట్నూర్ రూరల్/సోన్/దస్తురాబాద్, మే 7 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఇంద్రవెల్లి మండలంలోని దస్నాపూర్, దస్నాపూర్ గూడ, కోయల్ పాంద్రి, అనంతపూర్, గౌరాపూర్, దోబిగూడ, మోహన్‌గూడ, ధర్మసాగర్, మల్కుగూడ గ్రామాల్లో వడగండ్లు పడ్డాయి. ఈదురుగాలులతో ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. జొన్నతోపాటు కూరగాయలు, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. ఉట్నూర్ మండలంలో కూడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అక్కడక్కడ రాళ్లు పడ్డాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రజలు ఉపశమనం పొందారు. సోన్ మండలంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు గంటపాటు బలమైన గాలులు వీచాయి. రైతన్న వర్షం నుంచి తమ ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్లను కప్పారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. దస్తురాబాద్‌లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

ఇంద్రవెల్లి : వడగండ్లు

ఇంద్రవెల్లి : దస్నాపూర్‌లో కురిసిన వడగండ్లు

ప్రభుత్వ ఉద్యోగాల పేరిట మోసం

- నిరుద్యోగుల నుంచి లక్షల్లో వసూలు చేసిన కి'లేడి'
- మోసపోయామని తెలిసి లబోదిబోమంటున్న బాధితులు

బాధితులకు ఇచ్చిన చెక్కులు

నిర్మల్ అర్బన్, మే 7 : ప్రభుత్వ ఉద్యోగాల పేరిట నిర్మల్ జిల్లా కేంద్రంలో పలువురు యువకులు మోసపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిర్మల్ పట్టణానికి చెందిన ఓ మహిళ పలువురు నిరుద్యోగులకు ఏజెన్సీ ద్వారా ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికింది. ఉద్యోగంలో చేరాలంటే ముందుగా డబ్బులు ఖర్చవుతాయని చెప్పింది. పోస్టును బట్టి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆమెకు నిరుద్యోగులు ముట్టజెప్పారు. ఇటీవల పట్టణానికి చెందిన ఓ యువకుడు ప్రభుత్వ శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు కోసం రూ.3 లక్షల నగదును ఆమెకు ఇచ్చాడు. సదరు మహిళ ఉద్యోగం వచ్చినట్లు ఆర్డర్ కాపీని యువకుడికి ఇచ్చింది. ఉద్యోగంలో చేరేందుకు వెళ్లగా ఇలాగే మరో ముగ్గురికి నకిలీ ఆర్డర్ కాపీలను ఇచ్చి మోసం చేసినట్లు తెలిసింది. ఇదే తరహాలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని ఒకరి వద్ద రూ.8 లక్షల నగదును తీసుకుని నకిలీ ఆర్డర్ కాపీని చేతిలో పెట్టి మోసం చేసింది. తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వాలని మహిళను నిలదీయగా నకిలీ చెక్కులు, బాండ్‌లను రాసి ఇచ్చి తప్పించుకుని తిరుగుతుందని బాధితులు పేర్కొన్నారు.

జిల్లాలో పదుల సంఖ్యలో బాధితులు

నిర్మల్ పట్టణంలోనే పదుల సంఖ్యలో బాధితులు ఉండగా ఒక్కొక్కరి వద్ద లక్షల్లో వసూలు చేసినట్లు తెలిసింది. కోటి రూపాయలకు పైగా బురిడి కొట్టినట్లు తెలుస్తున్నది. బాధితులు ఎంత మంది ఉన్నారో తెలియాల్సి ఉంది. ఉద్యోగాల పేరుతో మోసం చేసిన మహిళపై ఫిర్యాదు చేసేందుకు బాధితులు ఎస్పీకి బుధవారం ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

జైనథ్‌లో ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

బోథ్ మండలంలోని పాచ్చెరలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రచారం

జోరుగా ప్రచారం

- నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ సమావేశాలు
- గ్రామాల్లో నాయకులు, కార్యకర్తల విస్తృత పర్యటనలు

ఆదిలాబాద్, మే 7(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగుతున్నది. మాజీ మంత్రి జోగు రామన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలను సమన్వయం చేస్తూ పకడ్బందీ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 16న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్లమెంట్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరై పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని సూచించారు. యువనేత పర్యటన నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అత్రం సక్కు విజయం కోసం అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాయకులు, ముఖ్య కార్యకర్తలు సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలను మాజీ మంత్రి జోగు రామన్న, అభ్యర్థి అత్రం సక్కు, స్థానిక నాయకులు హాజరై ప్రచారం ఎలా నిర్వహించాలని విషయంలో చర్చించారు. నాయకులు, కార్యకర్తలకు గులాబీ పార్టీ విజయం కోసం సలహాలు, సూచనలు అందజేశారు.

ఇంటింటా ప్రచారం

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామ ప్రచార కమిటీలు ఏర్పాటు చేసి ముందుగా తయారు చేసుకున్న ప్రణాళిక ప్రకారం ప్రచారం చేస్తున్నారు. పట్టణాల్లో వార్డు కమిటీలు ఏర్పాటు చేసి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతున్నారు. ప్రచార రథాలు గ్రామాల్లో తిరుగుతూ పాటల ద్వారా ఓటర్లను ఆకట్టుకుంటున్నాయి. ప్రచారంలో భాగంగా పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. కేంద్రంలో పదేళ్లు అధికారం ఉండగా, 2019 ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి బీజేపీ విజయం సాధించింది. పదేండ్లుగా పార్లమెంట్ పరిధిలో కేంద్రంలోని పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం లభించలేదు. ఆర్మూర్–ఆదిలాబాద్ రైల్వేలైన్, ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ, ఎయిర్‌పోర్టు, నవోదయ స్కూల్, ఇతర సమస్యలకు పరిష్కారం కాలేదు. ఇటీవల ఆదిలాబాద్‌లో పర్యటించిన ప్రధాని మోదీ పెండింగ్ ప్రాజెక్టుల విషయాలను ప్రస్తావించలేదు. రాష్ట్రంలో ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరు గ్యారెంటీలు అమలుకాకపోగా, విద్యుత్ కోతలు, మంచినీటి సమస్య పరిష్కారం కావడం లేదు. బీజేపీ, కాంగ్రెస్ వైఫల్యాలను వివరిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగుతున్నారు. పట్టణాలు, గ్రామాల్లో గులాబీ శ్రేణుల ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

మస్కాపురి ఇస్తారి(ఫైల్)

భీంపూర్, మే 7 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన ఉపాధి కూలీ మస్కాపురి ఇస్తారి (35) వడదెబ్బకు గురై మృతిచెందాడు. శనివారం ఇస్తారి ఉపాధి పనులకు వెళ్లి ఇంటికి తిరిగొచ్చాడు. రాగానే వాంతులు చేసుకోగా అతని భార్య 108తో రిమ్స్‌లో చేర్చింది. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు.

రిమ్స్‌లో వింత శిశువు జననం..

ఎదులాపురం, మే 7 : ఆదిలాబాద్ రిమ్స్ దవాఖానలో వింత శిశువు జన్మించగా కొద్ది సేపటికే మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. ఉట్నూర్‌కు చెందిన గర్భిణి ప్రసవం కోసం రిమ్స్ దవాఖానకు వచ్చింది. ఆమెకు వైద్యులు సాధారణ ప్రసవం చేయగా మగ శిశువును ప్రసవించింది. ఆ తర్వాత కొద్ది సేపటికే శిశువు మృతి చెందినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ తెలిపారు. శిశువుకు ఒక కన్ను మాత్రమే ఉండి మెదడు, చెవులు ఎదగలేదన్నారు. ఈ విషయంపై గైనాకాలజిస్ట్ స్వప్నను వివరణ కోరగా ఆ గర్భిణి ఐదో నెలలో స్కానింగ్ చేయించుకోలేదన్నారు. పౌష్టికాహారం తీసుకోకపోవడం, ఒత్తిడికి గురికావడం, 7వ నెలలోనే ప్రసవం, తదితర లోపాలు శిశువు జననానికి కారణమని ఆమె తెలిపారు.

సెకండ్ ర్యాండమైజేషన్ పూర్తి

ఎదులాపురం, మే 7 : ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి నిర్మల్, ముథోల్, ఖానాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లలోని కంట్రోల్ యూనిట్ల సప్లిమెంటరీ సెకండ్ ర్యాండమైజేషన్‌ను మంగళవారం పూర్తి చేసినట్లు ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్రవిజయ్, జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.